




నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

గుంటూరు పల్నాడు

శనివారం 17 మే 2025 - పేజీలు 8


## అవస్థలు పడుతున్న దరఖాస్తుదారులు

- మ్యాపింగ్ ఆధారంగానే దరఖాస్తుల స్వీకరణ
- ఇళ్ల మ్యాపింగ్‌లో పలు లోపాలు
- కొత్త కార్డుల జారీకి హౌస్ మ్యాపింగ్ కీలకం
- మ్యారేజ్ సర్టిఫికెట్‌కు తంటాలు
- ఓటీపీ ఆప్షన్ డిజేబుల్
- అవసరం లేదంటున్న పౌరసరఫరాల శాఖ మంత్రి
- బయోమెట్రిక్స్ పడకుంటే కార్డు రానట్లే.!
- రేషన్‌కార్డు దరఖాస్తు ఉచితం
- పలుచోట్ల రూ.100 వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు
- సచివాలయాల్లో దరఖాస్తులు అందక పాట్లు




# కొత్తకార్డుకు కష్టాలు

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులను స్వీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించిన ఆనందం ఆన్‌లైన్ కష్టాలతో ఆవిరైపోతోంది. దరఖాస్తులకు పెట్టిన నిబంధనలతో ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తప్పులతడకగా ఉన్న హౌస్ మ్యాపింగ్‌ను ఇప్పుడు దరఖాస్తుల స్వీకరణకు ప్రామాణికంగా తీసుకోవడంతో పాట్లు తప్పట్లేదు. సాక్షాత్తు పౌరసరఫరాల శాఖ మంత్రి మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరం లేదని చెప్పిన కొన్నిచోట్ల సచివాలయ సిబ్బంది కావాలని పట్టుబడుతున్నారు. ఈ సర్టిఫికెట్ కోసం ఎప్పుడో మ్యారేజ్ అయిన వాళ్ళు సబ్ రిజిస్టర్ కార్యాలయాలకు వెళితే రూ. 3 వేల నుంచి. రూ.5 వేలు ఖర్చు అవుతున్నాయని దరఖాస్తుదారులు వాపోతున్నారు. కార్డులో పిల్లల చేర్పు, కొంతమంది తొలగింపులో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బయోమెట్రిక్ పడనిచోట పరిస్థితి ఏమిటని కొంతమంది ప్రశ్నిస్తున్నారు. కొత్త కార్డులకు దరఖాస్తులు ఆహ్వానించిన ప్రభుత్వం సవాలక్ష నిబంధనలు విధించడం వల్ల కార్డు వస్తుంది అనే ఆనందం ఆవిరై పోతుంది. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు తీసుకునే విధానంలో కొన్ని నిబంధనలను తప్పనిసరిగా సడలించాలని ప్రజానీకం కోరుతోంది. దరఖాస్తులు ఉచితమని ప్రభుత్వం ప్రకటిస్తుంటే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా కొన్ని సచివాలయాల్లో అంగట్లో సరుకుల్లా ఒక్కొక్క దరఖాస్తుకు రూ.75 నుండి రూ.100 వసూలు చేస్తున్నట్లు కూడా ఆరోపణలు వస్తున్నాయి. ఇలాంటి లోపాలను సవరించాల్సిన బాధ్యత ప్రభుత్వాధికారులపై ఉంది....

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిని పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపటం లేదు. దరఖాస్తుల గడువు ముగుస్తుందనే ఆందోళనరో పలువురు ఉన్నారు. రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించిన ఆనందం ఆన్‌లైన్ కష్టాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైకి కనిపించకుండా రేషన్ కార్డు కావాలంటే అధికారులు దించిన సవాలక్ష నిబంధనలకు కార్డుదారులు బెంబేలెత్తిపోతున్నారు. దీంతో ప్రజానీకం సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తప్పులతడకగా ఉన్న

.. 3లో

# గుంటూరు ఛానల్ పనులు త్వరగా ప్రారంభించాలి

- విస్తరణ, భూసేకరణకు నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- భూసేకరణ సర్వే బాధ్యత కాంట్రాక్ట్ సంస్థ చేపట్టాలి
- జల వనరుల శాఖ అధికారులను ఆదేశించిన పెమ్మసాని



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** గుంటూరు ఛానల్ విస్తరణ పనులను త్వరగా ప్రారంభించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. అలాగే భూ సేకరణ సర్వే పనులతో త్వరిత కట్టిన ప్రారంభించాలని ఆయన అధికారులను శుక్రవారం ఆదేశించారు గుంటూరు ఛానల్ అభివృద్ధి పనులలో భాగంగా ప్రభుత్వం విడుదల చేసిన నిధులకు తగ్గట్టుగా పనులు ప్రారంభించాలని సూచిస్తూ పెమ్మసాని తన క్యాంప్ కార్యాలయంలో ఇరిగేషన్

.. 3లో

# ఆధునిక సాంకేతికతోనే దేశాభివృద్ధి

- ఆధునిక సాంకేతికతోనే దేశాభివృద్ధి
- కేంద్ర గ్రామీణ, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని వెల్లడి
- భూ వనరులకు రక్షణ కల్పించాలి
- భూ రికార్డులు డిజిటలైజేషన్ చేయాలి
- భూ సర్వే లో ఏడు రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి







**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** భారతదేశ అభివృద్ధి , ప్రగతి అనేది ఆధునిక సాంకేతిక విధానాలతో సాధ్యం అవుతుందని , దేశంలో ఆంధ్రప్రదేశ్ తో సహా ఏడు రాష్ట్రాలు భూ సర్వే డిజిటలైజేషన్లో ముందడుగులో ఉన్నాయని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం గుంటూరులోని ఐటీసీ వెల్కమ్ హోటల్ లో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, భూ వనరుల విభాగం ఆధ్వర్యంలో డిజిటల్ ఇండియా భూ రికార్డుల ఆధునీకరణ కార్యక్రమంలో భాగంగా సర్వే , రీసర్వే పై జరుగుతున్న జాతీయ కార్యశాల ముగింపు కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ , కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ సెక్రటరీ మనోజ్ జోషి, కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ జాయింట్ సెక్రటరీ కునాల్ సత్యార్థి, రాష్ట్ర సర్వే సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ డైరక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డి , ఇన్చార్జి జిల్లా కలెక్టర్ ఏ భార్గవ తేజ తో కలసి పాల్గొన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశ ప్రగతి టెక్నాలజీతోనే సాధ్యం అన్నారు. గుంటూరులో రెండు రోజులుగా ఈ సమావేశాలను నిర్వహిస్తున్న అధికారులకు, ఉన్నతాధికారులకు ధన్యవాదాలు. శాఖ పరంగా, వృత్తిపరంగా విజయవంతమైన పనులు నిర్వహిస్తున్న అందరికీ అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ఇది ఒక నిర్ణీత సమయానికి, రాష్ట్రాలకు నిధులు సేకరించడానికి ఈ కార్యక్రమం చక్కగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమం

.. 3లో

## విజ్ఞాన్స్ యూనివర్సిటీ అధ్యాపకుడికి డాక్టరేట్



**చేబ్రోలు, మేజర్ న్యూస్ :** చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రతాప్ కుమార్ రావుల అనే అధ్యాపకుడికి సీఎస్ఈ విభాగంలో తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ "డిటెక్షన్ అండ్ ప్రివెన్షన్ ఆఫ్ వార్మ్‌హోల్ అటాక్స్ ఇన్ ఏ వెహికులర్ అడహక్ నెట్‌వర్క్" అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని తెలియజేశారు. ఈయనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని అడ్వాన్స్ సీఎస్ఈ డిపార్ట్‌మెంట్‌కు చెందిన మాజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉప్పలపాటి శ్రీలక్ష్మి గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈయన తన పరిశోధనలో భాగంగా 4 స్కోపస్ పేపర్లు పబ్లిష్ చేశారని వెల్లడించారు. పీహెచ్‌డీ పట్టా పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రతాప్ కుమార్ రావులను వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

## కిశోరి వికాసం వేసవి శిక్షణా కార్యక్రమం



**వినుకొండ మేజర్ న్యూస్ :** ఐసిడిఎస్ ప్రాజెక్ట్ వినుకొండ సిడిపిఓ ఎం.అనురాధ ఆధ్వ ర్యంలో మండలంలోని నరగా య పాలెం సెక్టార్ లోని జల లపాలెం ఏడబ్ల్యూసి లో కిశోరి వికాసం ప్రోగ్రాం నిర్వహించటం జరిగింది. ఈ ప్రోగ్రాంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ ఎం.నాగరాజాకుమారి పాల్గొని బాలల హక్కుల రక్షణ చట్టం పోక్సో చట్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి కిశోరి బాలికలు, ఆశ, కే.వెలంగిని, వీఓఏ, కి.బాలస్వామి, ఏడబ్ల్యు డబ్ల్యు, జీవిల్‌పి.కుమారి, ఎ.వి.పద్మావతి, జి.పద్మ, జి.సునీత, టి.ధనలక్ష్మిలు, ఎంఎస్‌కె, బి.శ్రీలక్ష్మి, ఏడబుల్ హెచ్.కి.స్వాతి, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా జనసేన రాష్ట్ర కార్యదర్శి జిలానీ జన్మదిన వేడుకలు



**నరసరావుపేట రూరల్, మేజర్ న్యూస్:** జనసేన పార్టీ నరసరావుపేట ఇంఛార్జి, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వడ్లమూడిలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు చెందిన విద్యాసంస్థలు ఆధ్వర్యంలో కేక్ కోసి జిలానీకి శు భాకాంక్షలు తెలియజేశారు. అలాగే నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో కూటమి నేతలు జిలానీకి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# పడిపోతున్న పసిడి ధర.. తులానికి రూ 6000 పతనం



**గుంటూరు, మేజర్ న్యూస్ :** బంగారం ధరలు భారీగా తగ్గుతున్నాయి. నేడు పసిడి ధరలు ఇలా ఉన్నాయి. 24 క్యారట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 94,100 గా పలుకుతుండగా, 22 క్యారట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.86,570 పలుకుతోంది. ఇక ఒక కేజీ వెండి ధర రూ. 97,596గా ఉంది. గత నాలుగు రోజులుగా బంగారం ధర భారీగా తగ్గుతోంది దీనికి ప్రధానంగా అంతర్జాతీయంగా నెలకొన్నటువంటి పరిణామాలే కారణం అని చెప్పవచ్చు. ముఖ్యంగా బంగారం ధర తగ్గడానికి స్టాక్ మార్కెట్లలో లాభాలు నమోదు చేయడం కూడా బంగారం ధర తగ్గడానికి కారణమైందని భావిస్తున్నారు. బంగారం ధరలు తగ్గడానికి ప్రధానంగా అమెరికా చైనా మధ్య జరిగిన టారిఫ్ తగ్గింపు ఒప్పందం కారణం అని చెప్పవచ్చు. ఈ కారణంతో బంగారం ధరలు ఒక్కసారిగా తగ్గడం ప్రారంభించాయి.బంగారం ధరలు తగ్గడానికి ప్రధానంగా అంతర్జాతీయంగా ఉన్నటువంటి పరిస్థితులతోపాటు దేశీయంగా ఉన్న పరిస్థితులు కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. ప్రస్తుతం పసిడి ధరలు ఆల్ టైం రికార్డ్ స్థాయి నుంచి తగ్గుతున్నాయి. ఇదిలా ఉంటే ప్రస్తుతం అంతర్జాతీయంగా బంగారం ధర ఒక ఔన్స్ 3150 డాలర్లుగా ఉంది. గతంలో ఇది 3500 డాలర్లుగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర భారీగా తగ్గుతోంది. ఫ్యూచర్స్ మార్కెట్లో పసిడి ధరలు తగ్గుతున్నాయి. అయితే బంగారం ధరలు రిటైల్ మార్కెట్లో తగ్గడానికి కాస్త సమయం పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఫ్యూచర్స్ మార్కెట్ తో పోల్చి చూస్తే రిటైల్ మార్కెట్లో కాస్త నెమ్మదిగా బంగారం ధరలు తగ్గుతాయి.ఇదిలా ఉంటే బంగారం ధరలు తగ్గడంతో పసిడి ప్రియులు బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేందుకు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. పెళ్లిళ్ల సీజన్ కూడా కావడంతో బంగారు ఆభరణాలు కొనుగోలు చేసే వారికి తగ్గిన ధరలు కాస్త ఊరట అందిస్తున్నాయి. మరోవైపు బంగారం లో పెట్టుబడి పెట్టిన వారు ప్రస్తుతం ప్రాఫిట్ బుకింగ్ చేస్తున్నారు. ఈ కారణంగా కూడా బంగారానికి డిమాండ్ తగ్గి పసిడి ధరలు తగ్గుతున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు బంగారం ధరలు భవిష్యత్తులో తగ్గుతాయా లేదా అనే సందేహం కూడా చాలామందిలో కలుగుతోంది. అయితే ప్రస్తుతం ఉన్నటువంటి పరిస్థితులు అమెరికా చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు 90 రోజుల పాటు తగ్గే అవకాశం ఉంటుంది. ఒకవేళ 90 రోజుల తర్వాత కూడా ఇలాగే కొనసాగినట్లయితే బంగారం ధరలు మరింత తగ్గే అవకాశం ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ఇంటి వద్దకే రేషన్ పంపిణీకి త్వరలో మంగళం..!

- ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఎన్ డి యు వాహనాలను రద్దు చేయాలంటున్న డీలర్లు
- 20న మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయానికి సిద్ధమైంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అందుబాటులోకి తెచ్చిన రేషన్ డోర్ డెలివరీ వ్యవస్థను నిలిపివేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఈ మేరకు సంకేతాలు ఇచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడు కార్యాచరణ ప్రారంభించింది. అటు రేషన్ డీలర్లు ఇంటి కే రేషన్ సరఫరా చేసే వాహనాలను రద్దు చేయాలని కోరుతున్నారు. ఇటు ఎండీయూ ఆపరేటర్స్ తమకు వచ్చే ఏడాది వరకు అవకాశం ఇవ్వాలని పట్టు బట్టుతున్నారు. దీంతో, ఈ నెల 20న జరిగే మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

**వాహనాలు ఏం చేద్దాం..** వైసీపీ ప్రభుత్వ హాయంలో రేషన్ ను ఇంటి వద్దే పంపిణీ చేసేందుకు ప్రత్యేకంగా వాహనాల ద్వారా డెలవరీ వ్యవస్థను ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ వ్యవస్థ రద్దు చేయాలని భావించింది. ఇందులో భాగంగా పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో ఆ శాఖ ఉన్నతాధికారులు రేషన్ డీలర్ల సంఘాల ప్రతినిధులతోనూ, ఎండీయూ ఆపరేటర్స్ (ఎండీయూ ఆపరేటర్స్) సంఘ నాయకులతోనూ విడివిడిగా చర్చలు జరిపారు. రేషన్ సరుకుల పంపిణీ కోసం ఎండీయూ వాహనాలను కొనసాగించాలా.. వద్దా అనే అంశం పైన రెండు వైపులా అభిప్రాయ సేకరణ చేసారు. ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ డీలర్లు భిన్నమైన అభిప్రా యాలను వెల్లడించినట్లు తెలుస్తోంది.



**భిన్న వాదనలు..** ఎండీయూ వాహనాలను ప్రవేశపెట్టిన తర్వాత ప్రజా పంపిణీ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని రేషన్ డీలర్లు ఆరోపిస్తున్నారు. వాహనాలను ఇప్పటికిప్పుడు నిలిపివేస్తే తామంతా వీధిన పడతామని ఎండీయూ ఆపరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తమతో కుదుర్చుకున్న ఒప్పం దం 2027 జనవరితో ముగుస్తుందని, అప్పటి వరకు రేషన్ వాహనాలను కొనసాగిస్తే.. ఈలోగా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూసుకుంటామని ఎండీయూ ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలోని ఎండీయూ ఆపరేటర్లందరి ఏకాభిప్రాయంతో వారంలోగా ఏదో ఒక నిర్ణయం చెప్పాలని ఆపరేటర్ల ప్రతినిధులకు మంత్రి సూచించినట్లు తెలుస్తోంది. దీంతో, మరో విడత చర్చల తరువాత తుది నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది

# త్వరలో రాష్ట్ర లైబ్రరీ డిజిటలైజేషన్

- సీఎస్ఆర్ ఫండ్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ముందడుగు
- రూ.8 కోట్లతో అభివృద్ధికి చర్యలు
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** గ్రంథాలయాలకు చేయూత విద్యాదానంతో సమాన మని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరులోని రాష్ట్ర గ్రంథాలయానికి లైబ్రరీ ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుర్చీలు, ప్యాడ్లు, వాటర్ ప్యూరిఫైర్స్ ను శనివారం అందించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లైబ్రరీ ఓల్డ్ ఫ్రెండ్స్ తీసుకున్న ఈ నిర్ణయం రాబోయే తరానికి ఆదర్శంగా మారుతుందని తెలిపారు. రాష్ట్ర గ్రంథాలయంలో చదువుకున్న అనేక మంది గొప్ప స్థాయిలో నిలిచారని చెప్పారు. ఇదే లైబ్రరీలో తాను కూడా చదువుకున్నానని గుర్తు చేసుకున్నారు. గతంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానితో కలిసి గ్రంథాలయాన్ని సందర్శించామని, సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. ఇదే లైబ్రరీలో లైబ్రేరియన్ గా విధులు నిర్వహించిన అచ్చమాంబ.. ఇదే గ్రంథాలయానికి సేవ చేయాలని రావడం అభినందనీయమన్నారు. గ్రంథాలయాలు ఇకపై పుస్తకాలకే పరిమితం కాకుండా డిజిటలైజేషన్ వైపు ప్రయత్నిస్తామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం, సీఎస్ఆర్, రాష్ట్ర ప్రభుత్వ నిధులు కలిపి రూ. 8 కోట్లతో గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయబోతున్నామని చెప్పారు. లైబ్రరీని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాల్లో ఉన్న వారంతా తమవంతుగా సహకారం అందించాలని పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం గ్రంథాలయాలకు మహర్దశ తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. ప్రస్తుత యువత లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మురళి, పూల శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## పర్యావరణ కాలుష్యాన్ని అడ్డుకోవడం మనందరి బాధ్యత

**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :** పర్యావరణ కాలుష్యాన్ని అడ్డుకోవడం ద్వారా దాని ద్వారా ఏర్పడే వేడి వాతావరణంను తగ్గించుకోవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శు క్రవారం ఐటిసి ఫినిష్ సంస్థ వాతావరణ కాలుష్య నియంత్రణపై రూపొందించిన వాల్ పోస్టర్ ని ఐటిసి ఫినిష్ నారాయణ, పర్యావరణ విద్య నోడల్ ఆఫీసర్ తిరుపతిరెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్యల లో పర్యావరణ కాలుష్యమన్నారు. పర్యావరణ కాలుష్య నియంత్రణకు ప్రభుత్వాలు, సంస్థలతో పాటుగా ప్రజలు కూడా వ్యక్తిగత బాధ్యతగా పాటించాల న్నారు. నగరంలో వేసవిని దృష్టిలో పెట్టుకొని చలివేంద్రాలు, ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్స్ వద్ద నీడ వచ్చేలా గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రతి 3వ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా ఈ శనివారం బీట్ ది హీట్ నినాదం ఇచ్చిందని, అందు కు తగిన విధంగా నగరంలోని వార్డ్ సచివాలయాల వారీగా ప్రజా ప్రతినిధులు, ప్రజలు, వివిధ స్వచ్ఛంద సంస్థల భాగ స్వామ్యంతో ప్రజలకు వాతావరణ కాలుష్యం, ప్రమాదాలు, నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. ఐటిసి ఫినిష్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడానికి పోస్టర్స్ అందించడం అభినందనీయమన్నారు.

# కొత్త కార్డుకు కష్టాలు

**మొదటిపేజి తరువాయి**

హౌస్ మ్యాపింగ్‌ను ఇప్పుడు దరఖాస్తుల స్వీకరణకు కొలమానంగా తీసుకోవడంతో పాట్లు తప్పట్లేదు. అందులో కుటుంబసభ్యుల మ్యా పింగ్ ఒకేచోట జరగకుంటే వారి దరఖాస్తులు ఆన్‌లైన్ కావటం లేదని సిబ్బంది చెబుతున్నారు. ఈ తీవ్ర సమస్యగా మారింది. మ్యారేజ్ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేయడంతో అది ఎలా తెచ్చుకోవా లో తెలియక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే మంత్రులు, కొంతమంది అధికారులు , ప్రజా ప్రతినిధులు ఇది తప్పనిసరి కాదని ప్రకటించినా అది లేకుండా దరఖాస్తు తీసుకోకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్ప డం లేదు. తాజాగా ఆశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ సైతం ప్రకటించారు. ఇక ఎక్కువమంది దరఖాస్తుదారుల. బయోమెట్రిక్స్ పడకపోయినా దరఖాస్తు ఆన్‌లైన్ కావట్లేదు. ఓటీపీ ఆప్షన్ డిజేబుల్ చేయడంతో వేలిముద్రలు పడని వారు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఇదే స్థితి నెలకొంది.

### నిబంధనాలు

కూటమి ప్రభుత్వం నూతన రేషన్‌కార్డుల జారీ, కార్డుల విభజన, కొత్తగా కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామా మార్పులకు దరఖాస్తుల స్వీకరణతో పాటు ఇప్పటికే రైస్ కార్డులు ఉన్న వారు వాటిని ప్రభుత్వానికి సరెండర్ చేసే అవకాశాన్ని కల్పించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాల్లోని అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో కొన్ని రోజులుగా దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది.దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో విధించిన నిబంధనలు ఇప్పుడు కొత్త కష్టాలు తెచ్చిపెట్టా యి. అన్ని సరిచూసుకుని అప్‌లోడ్ చేసే సమయానికి సర్వర్లు పనిచేయక దరఖాస్తు చేసుకునేందుకు మూడు, నాలుగుసార్లు సచివాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. కార్డులకు ఇన్ని నిబంధనలు ఉంటే ఎలాగంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

### మ్యాపింగ్ లో తీవ్ర ఇబ్బంది

రేషన్‌కార్డుకు వివాహమై పిల్లలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలంటే భార్యాభర్తలు, పిల్లలు ఒకేచోట హౌస్ మ్యాపింగ్ ఉండాలి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్ల ద్వారా కుటుంబాల స్థితిగతులను తెలుసుకునేందుకు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేశారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణకు దీనినే ప్రామాణికంగా నిర్దేశించింది. తల్లిదండ్రులు, వారి పిల్లలు ఒకే కుటుంబం అయినప్పటికీ మ్యాపింగ్‌లో ఒకేచోట లేకపోతే దరఖాస్తు స్వీకరణ సమయంలో ఆన్‌లైన్‌లో ఎర్రర్ చూపిస్తోంది. అప్పుడు వలంటీర్లు చేసిన తప్పిదాలు ఇప్పుడు రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు శాపంగా మారాయి. మ్యాపింగ్‌లో మార్పులు, చేర్పులు, ఎడిట్ చేసే అవకాశాన్ని ఇవ్వకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యను పరిష్కరించకపోతే కొత్త రేషన్‌కార్డు పొందే అవకాశాన్ని కోల్పోతారు.

### నిబంధనలు సడలించండి

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ నిబంధన కొన్ని సడలించి, కొన్నింటిని పూర్తిగా తొలగించాలని కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు కోరుతున్నారు. తొలగించడంతోపాటు ఆధార్ ఆధారంగానే దరఖాస్తుల స్వీకరణ ఉండాలని డిమాండ్ వస్తోంది. మ్యారేజ్ సర్టిఫికెట్ నిబంధన తొలగించాలని ఎప్పుడో వివాహమై, సంతానం కలిగిన వారికి ఇప్పుడు మ్యారేజ్ సర్టిఫికెట్లు అడగడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మ్యారేజ్ సర్టిఫికెట్ల నిబంధనలు తొలగించి వీఆర్వో లేదా సంబంధిత పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరణతో ఆన్‌లైన్ చేసే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. బయోమెట్రిక్స్‌తోపాటు ఓటీపీ ఆప్షన్ ఇవ్వాలని, ఉమ్మడి కార్డులో ఉన్న ఎంతమందైనా విడిగా కార్డులకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించాలని పలువురు సూచిస్తున్నారు.

### దరఖాస్తు చేయాలంటే రూ.100

రేషన్‌కార్డు దరఖాస్తు ప్రభుత్వం ఉచితమని ప్రకటించింది. అయితే సచివాలయ సిబ్బంది ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొన్నిచోట్ల మాత్రం కార్డుకు రూ.100 వసూలు చేస్తున్నట్టు సమాచారం. తెనాలి, నరసరావుపేట, గుంటూరు ప్రాంతాల్లో కొన్ని సచివాలయాల్లో దరఖాస్తుదారుల నుంచి ఒక్కో కార్డుకు రూ.75 నుండి రూ.100 వసూలు చేస్తున్నట్టు. కొంతమంది దరఖాస్తుదారులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉన్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. దీనిని గురించి పట్టించుకున్న వారే లేరు..

### మ్యారేజ్ సర్టిఫికెట్ అక్కర్లేదు!

కొత్తగా కార్డు పొందడానికి మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి చేశారు. వివాహమైన వారిలో 95 శాతం మంది రిజిస్ట్రేషన్ చేసుకోరు. దీంతో ఇప్పుడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి మ్యారేజ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకు రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. అయితే మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరం లేదని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల ప్రకటించారు.

### బయోమెట్రిక్స్ పడకుంటే..!

కార్డుల దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో ప్రధాన దరఖాస్తుదారుడు తప్పనిసరిగా తన బయోమెట్రిక్స్ (వేలిముద్రలు) వేయాల్సి ఉంటుంది. బయోమెట్రిక్స్ పడకుంటే దరఖాస్తు ఆన్ లైన్ కావట్లేదు. గతంలో ఆధార్‌కు లింక్ అయిన మొబైల్‌కు ఓటీపీ వచ్చేది. దీని వల్ల బయోమెట్రిక్స్ పడనివారికి ఉపయోగకరంగా ఉండేది. ఓటీపీ ఆప్షన్ డిజేబుల్ చేశారని చెబుతున్నారు.

### విభజనలో కొత్త కష్టాలు

తల్లిదండ్రులతో కలిసి ఉన్న కొడుకులు, కుమార్తెలకు వివాహమై కొత్త కార్డు పొందేందుకు విభజన అవకాశాన్ని కల్పించిన ప్రభుత్వం దానిని ఒక్కరికే పరిమితం చేసింది. ఇద్దరు పిల్లలు ఉండి, వారికి వివాహమైతే అందులో ఒక్కరి నే విభజించే అవకాశం ఉండడంతో రెండో వారు దరఖాస్తు చేసుకునే వీల్లేకుండా పోతోంది. మ్యాపింగ్ సమయంలో భర్త వేరే ప్రాంతంలో ఉండడంతో పేరు కుటుంబంలో చేర్చకున్నా భార్య,పిల్లలకు కార్డు రావడం లేదు. భర్త లేకుండా విడిగా దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు.

### ఆధార్ చిరునామాతోనే...

ఆధార్ కార్డులో ఉన్న చిరునామానే దరఖాస్తు స్వీకరణ సమయంలో పరిగణనలోకి తీసుకుంటున్నారు. చిరునామా మార్పునకు అవకాశం ఇవ్వకపోవడంతో పాత చిరునామాలతోనే దరఖాస్తు చేస్తున్నారు. వివాహమైన తర్వాత ఆధార్‌లో భార్య ఇంటి పేరు మారకున్నా, భార్యాభర్తల ఇంటి పేర్లు ఒకేలా లేకున్నా ఆన్‌లైన్‌లో తీసుకోవట్లేదు. చదువుకున్న వారు ఉద్యోగాల కోసం ఆధార్‌లో ఇంటి పేరు మార్చుకోవడం లేదు. అటువంటి వారికి ఇబ్బంది ఎదురవుతోంది. చిన్నారుల బాల ఆధార్ అప్‌డేట్ అయితే కానీ వారి పేర్లను తల్లిదండ్రుల కార్డుల్లో చేర్చడానికి అవకాశం ఉండట్లేదు. ఇప్పుడు అప్‌డేట్ చేయించాలంటే కార్డుల దరఖాస్తు గడువు ముగిసిపోతుందని చెబుతున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడువు ఇవ్వాలని కోరుతున్నారు.

# ఆధునిక సాంకేతికతోనే దేశాభివృద్ధి

**మొదటిపేజి తరువాయి**

గ్రామీణ సముదా యాలు, మహిళలు మరియు గిరిజనుల పట్ల చాలా కీలకమైనది. మన గౌరవనీయ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారు చెప్పినట్లుగా, మనం నిజంగా 2047 నాటికి వికసిత భారతంగా మారాలని కోరుకుంటే, ఈ కార్యక్రమాన్ని తప్పనిసరిగా విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఎందుకంటే అభివృద్ధి చెందిన దేశాలు ఈ పని ఎన్నో సంవత్సరాల క్రితమే పూర్తిచేశాయని, మన పరిపాలనా సమస్యలను పరిగణనలోకి తీసుకుంటే కొంత ఆలస్యం జరుగుతున్నదీ నిజమే కానీ వచ్చే కొన్ని సంవత్సరాలలో మనం 100% పరిష్కారాన్ని సాధించగలమనే ఆశ ఉందన్నారు. రీ సర్వే కార్యక్రమంలో గ్రౌండ్ ట్రూథింగ్ నూరు శాతం సాధించినందుకు కర్ణాటక, ఇప్పటివరకు పరిష్కరించని భూముల వ్యవహారాన్ని పరిష్కరిస్తున్న అస్సాంను, మరియు 40 సెంటీమీటర్ల అధిక-స్పష్టత గల శాటిలైట్ చిత్రాలతో ముందుకు వస్తున్న రాజస్థాన్‌ను కూడా అభినందించాలి. ఇవన్నీ కాకుండా, మన ఆంధ్రప్రదేశ్ గురించి నాకు చాలా గర్వంగా ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి, నా రాజకీయ గురువు, నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ , శాఖ ఉన్నతాధికారులు మొత్తం పరిపాలనా యంత్రాంగం ఎంతో అద్భుతమైన పనిని కేవలం 10 నెలల్లోనే పూర్తి చేసి, ప్రోత్సాహక నిధులలో సింహభాగాన్ని దక్కించుకున్నారన్నారు. అలాగే, పౌర సాధికారత, సమాజం యొక్క భాగస్వామ్యం కోసం పని చేస్తున్న బీహార్ మరియు ఒడిశాను, మరియు అత్యంత పారదర్శక భూ రికార్డు వ్యవస్థను అభివృద్ధి చేస్తున్న హర్యాణాను, అలాగే మొదటి మరియు రెండవ తాత్కాలిక సర్వేలు పూర్తి చేసిన త్రిపుర రాష్ట్రాన్ని కూడా అభినందించాలి. ప్రథమ దశలో 15 లక్షల చ.కిమీ. ప్రణాళికలో భాగంగా 3 లక్షల చ.కిమీ. భూభాగాన్ని కవర్ చేశామన్నారు. ఈ వర్క్ షాపు మన దేశంలో సహకార పౌరసత్వ వ్యవస్థను ప్రదర్శిస్తుందని, అది మన దేశ బలమని నమ్ముతున్నామన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయ్యే నాటికి కచ్చితమైన అందుబాటులో ఉండే భూ రికార్డులు లభిస్తాయని, విధాన పరంగా, సాంకేతికంగా, నిధుల పరంగా మరియు అన్ని ప్రామాణిక కార్యాచరణ పద్ధతుల విషయంలో భారత ప్రభుత్వం మద్దతుగా ఉంటుందన్నారు.రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ పట్టణాల్లో రెవెన్యూ రికార్డులు పక్కాగా అమలు చేయడం , భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు నేషనల్ జియోస్పాటిల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (నక్షా) కార్యక్రమంను కేంద్రం తీసుకువచ్చిందన్నారు. వికసిత్ భారత్ 2047 ద్వారా దేశాన్ని ప్రధాని మోడీ,స్వర్ణాంధ్ర 2047 ద్వారా రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పూర్తిగా అభివృద్ధి చేసేలా లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. పట్టణాల్లో పారదర్శకమైన , సమర్థవంతమైన పాలన అందించేందుకు నక్షా కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుంది. నక్షా పైలట్ ప్రోగ్రామ్ ద్వారా దేశంలో 152 మున్సిపాల్టీలను సెలక్టు చేయగా అందులో రాష్ట్రంలో కుప్పం మున్సిపాల్టీ, ఒంగోలు, అనంతపురం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, కాకినాడ, మంగళగిరి - తాడేపల్లి , ఏలూరు, తిరుపతి నగరపాలక సంస్థలు మొత్తం 10 పట్టణాలను కేంద్రం ఎంపిక చేసిందన్నారు. దీని ద్వారా రాష్ట్రంలోని 10 మున్సిపాలిటీల్లో 524 చ.కిమీ.విస్తీర్ణంలో ఉన్న 9.5 లక్షల ఆస్తులను సర్వే చేసి డిజిటలైజేషన్ చేయనున్నామన్నారు. కేంద్రం సహకారంతో నిర్దేశిత గడువులోగా 10 మున్సిపాలిటీల్లో సర్వే పూర్తి చేసి రికార్డులను డిజిటలైజేషన్ చేస్తామన్నారు. ఇప్పటికే 8 మున్సిపాలిటీల్లో ఏరియల్ సర్వే పూర్తయిందని, ఏలూరు, మంగళగిరి - తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ లలో ఏరియల్ సర్వే కొనసాగుతుందన్నారు. కుప్పం, ఒంగోలు, అనంతపురం, మున్సిపాలిటీల్లో క్షేత్రస్థాయిలో 6000 ప్రభుత్వ ఆస్తుల రీసర్వే కూడా పూర్తయిందన్నారు. క్షేత్రస్థాయి సర్వేకు అవసరమైన 166 రోవర్లలో 158 రోవర్లు సిద్ధంగా ఉన్నాయని, సర్వే కోసం క్షేత్ర స్థాయిలో అవసరమైన 643 వెరిఫికేషన్ బృందాలను సిద్ధం చేశామన్నారు. నక్షా కార్యక్రమం పూర్తయితే పట్టణాలకు సరైన ప్రణాళిక , పన్నుల విధింపుతో పాటు ఆస్తుల వివాదాల కు చెక్ పెట్టవచ్చన్నారు. కేంద్రం తో కలిసి భూముల సర్వేకు అధిక ప్రాధాన్యత ఇచ్చి విజయవంతంగా నక్షా కార్యక్రమం నిర్దేశిత సమయంలో పూర్తి చేస్తామన్నరు. కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ సెక్రటరీ మనోజ్ జోషి మాట్లాడుతూ నాణ్యమైన భూ రికార్డులు నిర్వహించే రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ దాదాపు రూ.1000 కోట్ల వరకు ప్రోత్సాహక నిధులను అందిస్తుందన్నారు. ఆర్వోఆర్ లో 80 శాతంకు పైగా వ్యక్తిగత ఖాతాలు ఉంటే దానిని నాణ్యమైన భూ రికార్డులుగా గుర్తించటం జరుగుతుందన్నారు. అంధ్రప్రదేశ్ లో 90 శాతం పైగా డిజిటలైజ్డ్ చేసిన భూ ఖాతాలలో వ్యక్తిగత ఖాతాలు ఉండటంతో అత్యధికంగా ప్రోత్సాహక నిధులు అందుకోవటం జరిగిందన్నారు. ఆర్వోఆర్ లో జాయింట్ ఖాతాలు ఉండటం వలన మ్యూటేషన్ ఇబ్బందులు ఉంటాయని, స్థలాలు అమ్ముకున్న వ్యక్తిగత ఖాతాలుగా మార్పు చేయటం కుదరటం లేదన్నారు. దేశంలో అంధ్రప్రదేశ్, గుజరాత్ , రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో భూముల రీ సర్వే సక్రమంగా జరుగుతున్న కొన్ని రాష్ట్రాల్లో వివిధ కారణాలతో అశించిన స్థాయిలో రీ సర్వే కార్యక్రమాలు జరగటం లేదన్నారు. జాతీయ వర్క్ షాపు వలన రాష్ట్రాల్లో జరుగుతున్న భూముల రీ సర్వే పై కేంద్ర ప్రభుత్వ భూవనరుల శాఖకు అవగాహన వచ్చిందన్నారు. అదే విధంగా రాష్ట్రాలకు ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న రీ సర్వే చేస్తున్న విధానం తెలుసుకునే అవకాశం కలిగిందన్నారు. మానవ వనరులను ప్రణాళిక ప్రకారం వినియోగించుకొని రీ సర్వేను నిర్దేశించిన లక్ష్యాల అధిగమించేలా కృషి చేయాలన్నారు.

రెండవ రోజు వర్క్ షాపులో కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ జాయింట్ సెక్రటరీ కునాల్ సత్యార్థి కేంద్ర భూ వనరుల శాఖ సర్వే, రీ సర్వే , నక్షా కార్యక్రమాలకు దేశంలో వివిధ రాష్ట్రాలకు అందిస్తున్న నిధులు, ప్రోత్సాహకాలపై బీహార్, లడక్, ఒడిస్సా, హర్యాన, త్రిపురా రాష్ట్రాలలో జరుగుతున్న భూముల రీసర్వే సంబందిత రాష్ట్రాల సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వివిధ రాష్ట్రాల నుంచి ప్రజలు భూముల రీ సర్వేకు సంబంధించి తెలిపిన అనేక సందేహాలకు కేంద్ర భూ వనరుల శాఖ అధికారులు నివృత్తి చేశారు. కార్యక్రమంలో కేంద్ర భూ వనరుల శాఖ డైరక్టర్ శ్యామ్ కుమార్, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన సర్వే ల్యాండ్ రికార్డ్సు ఉన్నతాధికారులు, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసులు, సర్వే ల్యాండ్ రికార్డ్సు, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గుంటూరు ఛానల్ పనులు త్వరగా ప్రారంభించాలి

**మొదటిపేజి తరువాయి**

అధికారులతో ప్రత్యేక సమావేశమయ్యారు. గుంటూరు, పల్నాడు ప్రాంతాలకు ఉపయోగపడేలా గుంటూరు ఛానల్ విస్తరణ అభివృద్ధి పనుల 2025 - 26 బడ్జెట్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విస్తరణ, భూసేకరణకు కలిపి రూ. 400 కోట్లను నిధులను మంజూరు చేసింది. అందులో భాగంగా భూసేకరణకు రూ. 75 కోట్లను, విస్తరణకు రూ. 96 కోట్లను నాలుగు విడతలుగా విడుదల చేస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం ప్రకటించింది. కాగా ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో త్వరితగతిన విస్తరణ భూసేకరణ పనులను త్వరగా ప్రారంభించాలని పెమ్మసాని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే భూసేకరణలో భాగంగా నాలుగు గ్రామాల్లో నిర్వహించాలని సర్వే పనులను కాంట్రాక్టు సంస్థ చేపట్టాలని అధికారులకు ఆయన తెలియజేశారు ప్రభుత్వానికి అందించాల్సిన ప్రతిపాదనలు త్వరితగతిన పంపాలని, అభివృద్ధి పనులపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని అధికారులు పనిచేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ రాంబాబు, సూపర్ ఇండియన్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, **NADENDLA PADMAVATHI w/o NADENDLA SIVAPRASAD,** residing at DNo. 7-88-A china kondrupadu nadimpalem post, Prathipadu mandal, Guntur district. In my passport No. S4649576, my name has been incorrectly mentioned as **NADENDLA PADMA.** I request that it be corrected to **NADENDLA PADMAVATHI** in accordance with my Aadhar.

## ఏపీ రాష్ట్ర జై కాపుసేన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తిరుమలశెట్టి కొండలరావు నియామకం

**మంగళగిరి, మేజర్ న్యూస్:**

ఏపీ రాష్ట్ర జై కాపుసేన వర్కింగ్ ప్రెసిడెంట్ గా మంగళగిరి కి చెందిన తిరుమలశెట్టి కొండలరావు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో జై కాపుసేన వ్యవస్థాపక అధ్యక్షులు బసవ చినబాబు చేతుల మీదుగా కొండలరావు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో జై కాపుసేన వ్యవస్థాపక అధ్యక్షులు బసవ చినబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని పేద కాపులపై ప్రత్యేక దృష్టి సారించాలని, కాపులకు విద్య, వైద్యం ఉచితంగా అందించి న్యాయం చేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో కాపు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం జరిగేలా కృషి చేయాలన్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓబీసీ రిజర్వేషన్ ప్రక్రియలో భాగంగా కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తన వంతు కృషి చేశారని, అయితే అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఐదు శాతం కాపుల రిజర్వేషన్ ను తుంగలో తొక్కిందని విమర్శించారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నాయకత్వం లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కృషి చేసిన కాపు సామాజిక వర్గాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు కాపులకు అయిదు శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కాపు కార్పోరేషన్ రుణాలను స్థానిక ఎమ్మెల్యేల చేతుల్లో పెట్టడం వల్ల వారు తన అనుయాయులకు ఇచ్చుకుంటున్నారే తప్ప పేద కాపులకు న్యాయం జరగడం లేదన్నారు.



కాపు కార్పోరేషన్ కు డైరెక్టర్ లను కూడా నియమించి కాపు రుణాల మంజూరు వారి ద్వారా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లను జై కాపుసేన తరపున కలిసి కాపు సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్ల నున్నట్లు తెలిపారు. ఏపీ రాష్ట్ర జై కాపుసేన వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలశెట్టి కొండలరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని కాపుల హక్కులు, రిజర్వేషన్ల అమలు కోసం తన వంతు కృషి చేస్తా న్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జై కాపుసేన రాష్ట్ర అధ్యక్షులు బెల్లంకొండ వెంకన్న బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సమ్మెట వెంకన్న బాబు, చిట్టూరి రవీందర్, మేడేపల్లి కనక రామకృష్ణ , ప్రధాన కార్యదర్శి మొహమాటం అనిల్ బాబు, లీగల్ సెల్ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, గుంటూరు జిల్లా అధ్యక్షులు ఎడ్లపల్లి దానారావు, పల్నాడు జిల్లా అధ్యక్షులు అన్నదాసు శ్రీనివాసరావు, జిల్లా యువజన అధ్యక్షులు సోమరాజు సాంబశివరావు, గుంటూరు జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వామన పల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవ ర్యాలీ



**మంగళగిరి, మేజర్ న్యూస్:**

నగరంలోని ఇందిరా నగర్ యూపీహెచ్సీలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం హెల్త్ సెంటర్, మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ నివారణ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి. అనూష ఈ ఏడాది థీమ్ అయిన పరిశీలించండి...శుభ్రం చేయండి... మూతలు పెట్టండి... అనే మూడు అంశాలతో ఏఎన్ఎంలు, ఆశాలు, హెల్త్ సెంటర్ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డాక్టర్ అనూష మాట్లాడారు. ఏడీస్ అనే పగలు కుట్టే దోమ కాటు వల్ల డెంగ్యూ సోకుతుందన్నారు. డెంగ్యూ సోకిన వారికి అధిక జ్వరం, వాంతులు, దద్దుర్లు, తలనొప్పి, కీళ్ల కండరాల నొప్పి, కళ్ళ వెనక నొప్పి, ప్లేట్ లేట్లు పడిపోయి చిగుళ్ళు, ముక్కు నుండి రక్తం కారుట వంటి లక్షణాలు ఉంటాయన్నారు. డెంగ్యూకు గురికాకుండా ఉండటానికి ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, టైర్లు, కొబ్బరి చిప్పలు, కూలర్స్ వంటి వాటిలో నీరు నిలవకుండా ఉంచుకోవాలన్నారు. డెంగ్యూ లక్షణాలు కనబడితే సమీపంలోని హెల్త్ సెంటర్లో ప్రభుత్వం అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అనూష అన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ఏ శ్రీమన్నారాయణ, ఎయిమ్స్ వైద్యులు డాక్టర్ దీపిక, డాక్టర్ ఆదిత్య, మలేరియా సూపర్వైజర్ సైదులు, హెల్త్ అసిస్టెంట్స్ వాసు, నరసింహారావు, హెల్త్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశం సత్తాను ప్రపంచానికి చాటిన ఆపరేషన్ సిందూర్ : చీఫ్ విప్ జీవీ



**వినుకొండ, మేజర్ న్యూస్ :**

తిరంగా ర్యాలీలో పాల్గొన్న చీఫ్ విప్ జీవీ, జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా సైనిక బలగాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ భారతదేశం సత్తా ను ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. భారత సైనిక శక్తి, సంకల్పానికి నిదర్శనంగా నిలిచిన ఆపరేషన్‌లో సైన్యం ధైర్యసాహసాలు, లక్ష్యాల్ని తుత్తునియలు చేసిన సాంకేతికతలపై అంతా ఆశ్చర్యపోయి చూస్తున్నారన్నారు. కశ్మీ ర్‌లో అమాయకులను బలితీసుకున్న ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పిన ప్రధాని మోదీ, ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన త్రివిధ దళాలకు ధన్య వాదాలు తెలుపుతున్నామని అన్నారు. ఈ మేరకు సైనికులను అభినందిస్తూ శుక్రవారం వినుకొండలో భారీగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ సమైక్యత, సమగ్రతను చాటేలా గీతాలు ఆలపించారు. భారత్ మాతాకీ జై, జైహింద్, వందేమాతరం వంటి నినాదాలు అంతటా మార్మోగాయి. ఈ సందర్భంగా మాట్లాడి న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు శత్రుదేశంపై ప్రాణాలు లెక్కచేయకుండా పోరాడిన వీరజవాన్లకు సెల్యూట్ చేస్తున్నామన్నారు. ఈ పోరాటంలో అమరుడైన వీరజవాన్ మురళీనాయక్‌కు జోహార్లు అర్పిస్తున్నామన్నారు. మురళీనాయక్ కుటుంబానికి సీఎం చంద్రబాబు, ప్రభుత్వం కూడా అండగా నిలబడిందని, రూ.50 లక్షల నగదుతో పాటు 5 ఎకరాల భూమి ప్రకటించారన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆపరేషన్ సిందూర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించి దేశానికి అండగా నిలబడ్డారన్నారు. 145 కోట్ల మంది భారత జాతి.. హిందూ, ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీలు కుల, మతాలకు అతీతంగా తామంతా ఒక్కటేనని సమైక్యతను చాటి చెప్పారన్నారు. ఈ తిరంగా యాత్ర జాతీయ ఐక్యత చిహ్నమని, అన్నివర్గాల ప్రజల్ని ఒక్కతాటి పైకి తెచ్చి, సైన్యానికి గౌరవ వందనం, దేశభక్తిని బలోపేతం చేసే ప్రయత్నమని చెప్పారు. ఇకపై ఉగ్రవాదులు దేశంవైపు కన్నెత్తి చూడాలంటే భయపడేలా ఆపరేషన్ సిందూర్ నిర్వహించారని, ఈ పోరాటం భవిష్యత్తులో కూడా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులతో పాటు జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, విద్యార్థులు, యువత, కూటమి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. వినుకొండ మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ప్రదర్శన శివయ్య స్తూపం, కారంపూడి రోడ్డు, సురేష్ మహల్ రోడ్డు మీదుగా సాగింది.

## పారిశుద్ధ్య కార్మికులకు సామగ్రి పంపిణీ




**తెనాలి, మేజర్ న్యూస్**

పారిశుద్ధ్య కార్మికుల శ్రేయస్సుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని మున్సిపల్ ఛైర్మన్ తాడిబోయిన రాధిక తెలిపారు. స్థానిక పురపాలక సంఘ ఆవరణలో శుక్రవారం సుమారు 400 మందికి పైగా పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం, కొబ్బరి నూనె, సబ్బులు వంటి సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు కార్మికులు అందిస్తున్న సేవలను కొనియాడారు. మున్సిపాలిటీ కమీషనర్ శేషన్న మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు తమ విధి నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న దని తెలిపారు. వారికి రేడియం జాకెట్, సబ్బులు, కొబ్బరి నూనె, క్యాప్, హ్యాండ్ గ్లోజులు అందించామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, ప్రజారోగ్య విభాగపు అధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల, మాజీ వైస్ ఛైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, సానిటరీ ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు.

## వివాహ మహోత్సవాన్ని హాజరైన చీఫ్ విప్

**ఈపూరు మేజర్ న్యూస్:**

వినుకొండ నియోజకవర్గ ఈపూరు మండలం ముప్పాళ్ళ గ్రామం నందు ఫోటో గ్రాఫర్ రామకృష్ణ వివాహ వేడుకలలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.



# తెనాలిలో జాతీయ డెంగ్యూ దినోత్సవం

**తెనాలి, మేజర్ న్యూస్ :**

జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం తెనాలిలో డెంగ్యూ వ్యాధి పై అవగాహన ర్యాలీని పట్టణంలోని నందులపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక, సహాయ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి జండా ఊపి ప్రారంభించారు. స్థానిక పాత ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రారంభమైన ర్యాలీను ద్దేశించి ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ప్రజలలో డెంగ్యూ వ్యాధి పట్ల అవగాహన కలిగించి, డెంగ్యూ వ్యాధిని నిర్మూలించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని తెలిపారు. ముఖ్యంగా డెంగ్యూ వ్యాధికి ఆర్బో వైరస్ ప్రధాన కారణమని, ఈ వైరస్ తో కూడిన ఆడ ఎడిస్ దోమ కాటు వలన ఈ వ్యాధి ఒకరి నుండి మరొకరికి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. దోమలు ఇంట్లోకి ప్రవేశించకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సాలిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ ఆర్బో వైరస్ వలన డెంగ్యూ వ్యాధి మాత్రమే కాకుండా చికెన్ గునియా జికా వైరస్ లు కూడా వస్తాయని దోమల ద్వారా మలేరియా డెంగ్యూ చికెన్ గునియా మెదడు వాపు వ్యాధి బోదకాలు తదితర వ్యాధులు కూడా వ్యాపి చెందుతాయని చెప్పారు. సహాయ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి మాట్లాడుతూ ప్రజలు వారానికి ఒకసారి నీటి నిల్వలను మార్చుకోవాలని అందుకు ప్రభుత్వము శుక్రవారంని డ్రై డే గా పాటించమని సూచించిందని తెలిపారు. తెనాలి పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ నీటి నిల్వలను శుభ్రపరచుకొని, నీటిపై మూతలు



పెట్టుకొనుట ద్వారా దోమలు గుడ్లు పెట్టే అవకాశం లేక ,దోమల యొక్క సంతతి తగ్గి ,వ్యాధుల వ్యాప్తిని అరికట్టడానికి అవకాశం కలుగుతుందని, ప్రజలు దీనిపై అవగాహన కలిగించుకొని సహకరించవలెనని విజ్ఞప్తి చేశారు. అనంతరం తెనాలి ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి దోమల నియంత్రణ పద్ధతులపై నినాదాలు చేయిస్తూ ర్యాలీని నిర్వహించి వ్యాధిని అరికట్టలకు ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఫైలేరియా సీనియర్ హెల్త్ ఇన్స్పెక్టర్ జి. రవికుమార్ నందుల పేట మారీస్ పేట, పద్మశాలిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు, వార్డు హెల్త్ సెక్రటరీలు ,ఆశా కార్యకర్తలు ,ఆరోగ్య పర్యవేక్షకులు బండారు మల్లేశ్వరరావు, దీపాల శ్రీనివాసరావు ,దాసరి శివనాగమల్లేశ్వరరావు, పుష్పలత ,ఆరోగ్య కార్యకర్తలు రషీద్, నవీద్, కరిముల్లా ,శరత్, శ్రీనివాసరావు ,మలేరియా ఫైలేరియా యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

# మరో మూడు రోజులు భారీ వర్ష సూచనలు

## జిఎంసి కాల్ సెంటర్ 08632345103, 104, 105 ఏర్పాటు

- విరిగిపడిన చెట్లు, హోర్డింగ్స్, విద్యుత్ స్తంభాలు
- నగర ప్రజలు అప్రమత్తతతో సురక్షితంగా ఉండాలని సూచన
- అధికారులను అప్రమత్తం చేసిన నగర కమిషనర్

**నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్:**

రాబోవు మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాతావరణ శాఖ సూచనల మేరకు నగరంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, గత రాత్రి కురిసిన వర్షానికి నగరంలో విరిగిన చెట్లను తొలగించడం, హెూర్డింగ్స్ ని తొలగించడం, నీరు నిలిచిన ప్రాంతాల్లో బెయిల్ అవుట్‌ను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులకు స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ 3 వంతెనలు, అరండల్ పేట, అమరావతి రోడ్, విద్యా నగర్ మెయిన్ రోడ్, మారుతి నగర్, కంకరగుంట ఆర్యుబి తదితర ప్రాంతాల్లో పర్యటించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షం వలన ప్రజలకు ఏ సమస్య తలెత్తకుండా జిఎంసి అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్యలు, చెట్లు విరిగి ట్రాఫిక్ కి అడ్డుగా





ఉన్నా, వర్షం నీరు నిలిచినా తక్షణం జిఎంసి కాల్ సెంటర్ 086323 45103, 104, 105 నంబర్లకు కాల్ చేస్తే సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. నోడల్ అధికారులు, ఇతర సిబ్బంది క్షేత్ర స్థాయిలో విధుల్లో ఉండాలని, విభా గాధిపతులు ఎక్కడా సమస్య రాకుండా సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. 3 వంతెనల వద్ద నిలిచిన సిల్ట్ ని, జెట్టింగ్ మెషిన్ల ద్వారా శుభ్రం చేయా లని, కంకర గుంట ఆర్యుబి వద్ద అదనపు మోటార్లను ఏర్పాటు చేసి నీటిని బెయిల్ అవుట్ చేయాలని డిఈఈని ఆదేశిం చారు. విరిగిన చెట్లను తొలగించడానికి ఉద్యానవన సిబ్బందిని అందుబాటులో ఉంచి, కాల్ సెంటర్ నుండి వచ్చిన ఫిర్యాదులను తక్షణం హాజరు కావాల న్నారు. విధ్యుత్ సరఫరా అంతరాయం వలన త్రాగునీటి సరఫరాకి సమస్య లేకుండా ముందస్తుగా జనరేటర్లు ఏర్పాటు చేసుకోవడం, విద్యుత్ శాఖ అధికారు లతో సమన్వయం చేసుకోవాలని ఈఈ లను ఆదేశించారు. మెయిన్ డ్రైన్లలోకి చిన్న డ్రైన్లు కలిసే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మెష్ ల వద్ద వ్యర్థాలను ప్రజారోగ్య కార్మికుల ద్వారా ఎప్పటికప్పుడు తొలగించేలా పర్యవేక్షణ చేయాలని సిఎంఓహెచ్ ని ఆదేశించారు. నగరంలో పలు ప్రాంతాల్లో హెూర్డింగ్స్ విరిగి, బ్యానర్లు గాలికి ఎగు రుతున్నాయని, ఆయా హెూర్డింగ్ లను తక్షణం తొలగించాలని సిటి ప్లానర్ ని ఆదేశించారు. అలాగే నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తు భవన యజమానులు వర్షాలకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, శిధిలావస్థలోని పురాతన భవన యజ మానులకు నోటీసులు ఇవ్వాలని పట్టణ ప్రణాళికాధికారులను ఆదేశించారు. పర్య టనలో సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఈఈ సుందర్రామిరెడ్డి, డిఈఈ మధు సూధన్, ఏఈలు, టిపిఎస్ లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# నేడు టీడీపీ ఆధ్వర్యంలో తిరంగ ర్యాలీ



**తెనాలి, మేజర్ న్యూస్ :**

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ తెనాలి చిన్నరావూరు పార్క్ నుండి బోసు రోడ్డు,గాంధీ చౌక్,మెయిన్ రోడ్డు నుండి మున్సిపల్ బిల్డింగ్ ఎదురు ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం వరకు త్రివిధ దళాలకు మద్దతుగా తిరంగ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, విద్యార్థులు, దేశ పౌరులు,అన్ని మతాల నేతలు, సైనిక కుటుంబాలు, కూటమి నాయకులు అందరూ తప్పక జాతీయ జెండాలతో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# నేడు స్వచ్ఛత కార్యక్రమ నిర్వహణ

**తెనాలి, మేజర్ న్యూస్ :**



స్వచ్ఛత దినోత్సవంలో భాగంగా పట్టణంలో బీట్ ది హీట్ కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమీషనర్ శేషన్న తెలిపారు. శుక్రవారం మున్సిపల్ చైర్మెన్ ఛాంబర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నెల మూడవ శనివారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛత కరుల్యక్రమంలో భాగంగా బీట్ ది హీట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమం శివాజీ చౌక్ వద్ద నుండి ప్రారంభమై మున్సిపల్ కూరగాయల మార్కెట్ వరకు కొనసాగుతుందని తెలిపారు. సాయంత్రం చెంచుపేట లోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నుండి ప్రారంభమై రావి కన్వెన్షన్ హాలు వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్మెన్ తాడిబోయిన రాధికకు పాల్గొంటారని చెప్పారు.

# శివాలయం దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి దంపతులు.



**పెదకాకాని, మేజర్ న్యూస్ :-**

పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి ఆర్ మధుసూదనరావు దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. జస్టిస్ దంపతులకు ఆలయ అధికారులు సాదర స్వాగతము పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. న్యాయమూర్తి దంపతులు రాహు కేతు పూజలలో పాల్గొన్నారు. శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్లకు అష్టోత్తరం ప్రత్యేక పూజలు అనంతరము నిత్య కళ్యాణ మండపము నందు ఆలయ అర్చకస్వాములు, వేదపండితులు వేద ఆశీర్వచనాలు చేయగా శ్రీ స్వామి వారి శేషవస్త్రముతో సత్కరించి లడ్డూ ప్రసాదాలు, శ్రీ స్వామి వారి చిత్రపటం అందజేసినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించిన పంచాయతీరాజ్ శాఖ కమిషనర్



**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్:**

నిర్మాణంలో ఉన్న భవనాల త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఎం. వెంకట రామకృష్ణ తేజ సూచించారు. శుక్రవారం నిర్మాణంలో ఉన్న జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం భవనాన్ని ఆయన ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా తో కలిసి పరిశీలించారు. జరుగుతున్న పనుల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా పరిషత్ ప్రాంగణంలోని నూతనంగా ఏర్పాటు చేసిన డి ఎల్ డి ఓ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతి బస్సు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఓ ఎస్ డి వెంకటకృష్ణ, ఆర్డబ్ల్యూఎస్ ఈ కళ్యాణ చక్రవర్తి, డి.ఇ శివరామకృష్ణ, పంచాయతీరాజ్ ఎస్ ఈ బ్రహ్మయ్య, డిడబ్ల్యూఎంఏ పిడి శంకర్, డిపి సాయికుమార్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాలలో సి. సి. కెమెరాల మీద పరిశీలన. ఎక్సైంజ్ సీఐ




**ఈపూరు, మేజర్ న్యూస్ :**

శుక్రవారం ఈపూర్ ప్రోహిబిషన్ మరియు ఎక్సైజు స్టేషన్ పరిధిలో వున్న మద్యం దుకాణాలలో సి.సి. కెమెరాలు ఏర్పాటు మరియు సి.సి. కెమెరాలు సక్రమంగా పని చేస్తున్నాయో లేదో పరిశీలించడంలో భాగంగా ఈ రోజు ఈపూరు గ్రామంలోని GK11 మద్యం దుకాణంను ఈపూరు ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు ఆకస్మికంగా సందర్శించి సి.సి.కెమెరాలు ఏర్పాటు మరియు సి.సి. కెమెరాల పనితీరును పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రోహిబిషన్ మరియు ఎక్సైజు ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ఈపూరు ఎక్సైజు సర్కిల్ పరిధిలో వున్న అన్ని మద్యం దుకాణాలు యందు సి.సి. కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది అని, సదరు సి.సి. కెమెరాలు పనితీరు సక్రమంగా వున్నది, లేనిది పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించం జరుగుతుంది అని తెలిపారు. అలాగే బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం నేరం అని తెలిపారు.

## ఈ రోడ్డుకు శాశ్వత పరిష్కారం లేదా....



**పెదకాకాని, మేజర్ న్యూస్:-**

మండల కేంద్రమైన పెదకాకాని సెంటర్ నుండి వెనిగండ్ల వైపు వెళ్లే రోడ్డు అపార్ట్మెంట్ల వలన సైడ్ కాలవలు మూసుకొని పోవడంతో మురుగునీరు రోడ్డుపైన నిలిచి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాయని వాహన చోదకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిష్కార మార్గం చూడాలని కోరుతున్నారు.

# దైవాజ్ఞలను అనుసరిస్తేనే ప్రశాంత జీవితం

## - జనాబ్ అబ్దుల్ జబ్బార్

**మంగళగిరి, మేజర్ న్యూస్:**

దైవాజ్ఞలను జవదాటకుండా అనుసరిస్తేనే ఇహ-పరలోకాల్లో ప్రశాంత జీవితం పొందవచ్చునని జనాబ్ అబ్దుల్ జబ్బార్ అన్నారు. మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం బసవతారకనగర్ మస్జిద్ -ఎ-మొహమ్మద్ లో శుక్రవారం జుమా ఖుత్బాకు ఆయన హాజరై ప్రసంగించారు. ఈ అనంత సృష్టిని సృష్టించిన ఆ ఏకైక దైవాన్ని మాత్రమే ఆరాధించాలన్నారు. జన్మనిచ్చిన తల్లి తండ్రుల పట్ల ఉత్తమ రీతిలో మెలగాలన్నారు. నేటి సమాజంలో చాలా మంది తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదన్నారు. అటువంటి వారు నమాజ్‌కు వచ్చి ప్రార్థనలు చేసినంత మాత్రాన ఆమోదయోగ్యం కావన్నారు. తల్లిదండ్రులపట్ల సహృదయంతో మెలగాలని, కోపంలో ఉఫ్ అని కూడా అనకూడదన్నారు. తల్లి పాదాల కింద స్వర్గం ఉందని.. తండ్రి స్వర్గంలోని ముఖద్వారం వంటివాడ న్నారు. నేటి ముస్లిం సమాజంలో సైతం రుగ్మతలు పెరిగిపోతు న్నాయని, కుటుంబ సభ్యులతో సైతం శత్రుత్వాన్ని పెంచు కోవడం బాధాకరమైన విషయమన్నారు. ముస్లింలు ఒకరినొకరు సోదరులని, అటువంటి భావన లేకుంటే వారు విశ్వాసులే కాదన్నారు. రక్త సంబంధీకులతో మంచిగా మెలగడంతో పాటు సమాజంలో ప్రతి ఒక్కరితో కలిసిమెలిసి ఉండాలన్నారు. ఇస్లాం అంటేనే సమాజంలో పది మందితో కలిసి ఉండటమన్నారు. జీవించి ఉన్నవారికి ఆహారం ఎంత అవసరమో... చనిపోయిన వారికి దుఆ (ప్రార్థనలు) కూడా అంతే అవసరమన్నారు. మనం చనిపోయిన తరువాత భార్య, పిల్లల దుఆలు మాత్రమే సరిపోవని, మన తోటి దైవ విశ్వాసుల దులు కూడా ఎంతో అవసరమన్నారు.

## గుండ్లకమ్మ వంతెన పనులను పరిశీలించిన : చీఫ్ విప్ జీవి

**వినుకొండ, మేజర్ న్యూస్:**

వినుకొండ మండలం అందుగుల కొత్తపాలెంవద్ద గుండ్లకమ్మ నదిపై నిర్మాణంలో ఉన్న వంతెన పనులను ప్రభుత్వ చీఫ్ విప్,శాసనసభ్యులు జీవి ఆంజనేయులు జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు మరియు వినుకొండ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కొంజేటి నాగ శ్రీను రాయల్ శుక్రవారం రోజున పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వంతెన నిర్మాణ పనుల పురోగతిని, నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయుకులు అధికారులు పాల్గొన్నారు.







## రోజువారి శానిటేషన్ లో భాగంగా పలు వార్డులలో పర్యటించిన కమిషనర్ పి శ్రీధర్





**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :**

పిడుగురాళ్ల పురపాలక సంఘంలో రోజు వారి శానిటేషన్ పరిశీలనలో భాగంగా ఈరోజు మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ పిడుగురాళ్ల 17వ వార్డులో రోడ్డు స్లీపింగును పరిశీలించి, 31 వ వార్డు లో చెత్తను క్లియర్ చేయించారు. 13వ వార్డులో గార్బేజ్ ను క్లియర్ చేయించారు. తదనంతరం 15 వ వార్డులో డోర్ టు డోర్ కలెక్షన్స్ సక్రమంగా జరిగేటట్లు ఆదేశాలు ఇచ్చారు. 24 వార్డులో ఎదురుగా గల మేజర్ డ్రైన్ లో పూడికలు తీయించారు. తదనంతరం పిడుగురాళ్ల బస్టాండ్, అన్నా క్యాంటీన్ లో గల క్యాంటీన్ ను రోజువారి ఇన్స్పెక్షన్లలో భాగంగా ఈరోజు కూడా ఇన్స్పెక్షన్ చేసి, ఈరోజు బెనిఫిషియస్ కు ఇచ్చిన బ్రేక్ఫాస్ట్ మెయిన్ లో క్వాలిటీ- క్వాలిటీ చెక్ చేసి, ప్రభుత్వ నిబంధనల మేరకు సరఫరా చేయవలసిందిగా నిర్వాహకులను కమిషనర్ పి శ్రీధర్ ఆదేశించారు.

## నాసిరకం పనులు చేసిన కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలి

**నగరపాలక సంస్థ కమీషనర్ ను కోరిన జనసేన జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి**



**గుంటూరు, మేజర్ న్యూస్ :** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పలు అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలను గాలి కొదిలేశారని, నాసిరకం పనులు చేసిన కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. శుక్రవారం తెల్లవారుజామున వీచిన గాలికి స్థానిక సంపత్ నగర్ రామనామ క్షేత్రం రోడ్డులో నూతనంగా నిర్మించిన విద్యుత్ స్తంభం నేలకొరగటంపై అయన తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సమయానికి అక్కడ పాదచారులు కానీ వాహనదారులు కానీ ఎవరు లేరు కాబట్టి పెను ప్రమాదం తప్పింద న్నారు. గాలికి పడిపోయేలా నాసిరకం విద్యుత్ స్తంభాలను నిర్మిస్తుంటే అధికారులు, క్వాలిటీ కంట్రోల్ వారు ఏమి చేస్తున్నారని నిలదీశారు. గత పాలకులు, అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కయి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నారని విమర్శించారు.

వైసీపీ హయాంలో అవినీతి తిమింగళాలు ఇష్టానురీతిగా రెచ్చిపోయాయని, గత పాలనలో జరిగిన పనులపై విజిలెన్స్ దర్యాప్తుకు ఆదేశించాలని ఆళ్ళ హరి కోరారు.

# నరసరావుపేటలో తిరంగా ర్యాలీ పాల్గొన్న ఎమ్మెల్యే డా.చదలవాడ

**నరసరావుపేట, మేజర్ న్యూస్ :**

ఉగ్రదేశం పాకిస్తాన్‌లో ఉన్న ఉగ్ర స్థావరాలను మట్టు పెట్టి శత్రుదేశం గుండెలపై గుద్ది ప్రపంచానికి భారత దేశ శక్తిని చూపిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేయడంలో భారత సైనికుల ధైర్య సాహసాలను స్మరించుకుంటూ తిరంగా యాత్ర నిర్వహించారు వీరోచిత పోరాటం చేసిన భారత సైనికులకు







మద్దతుగా మేమున్నా మంటూ నినాదంతో నరసరావుపేట పట్టణంలో ఎస్ ఎస్ ఎన్ కళాశాల వద్ద నుండి మల్లమ్మ సెంటర్ వరకు చేపట్టిన తిరంగా ర్యాలీకి నరసరావుపేట నియోజకవర్గం శాసనసభ్యులు డా. చదలవాడ అరవింద బాబు పాల్గొని ప్రారంభించారు. 300 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు సైనికులకు ధన్యవాదాలు తెలియజేసారు. భరతమాత కీ జై అంటూ నినా దాలు చేసారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట నియోజ కవర్గం ప్రజలు టీడీపీ జనసేన బీజేపీ కూటమి నేతలు ప్రజా సంఘాల నేతలు పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## వెనుకబడిన మాచర్లను ఆదుకోండి..

**- సీఎం చంద్రబాబును అభ్యర్థించిన ఎమ్మెల్యే జూలకంటి..**

**రెంటచింతల, మేజర్ న్యూస్ :**

మాచర్ల నియోజకవర్గంలో పురాతన ఆలయాలైన మాచర్ల శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి, రెంటచింతల మండలంలోని సత్రశాల శ్రీ మల్లికార్జునస్వామి ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటా యించాలని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అభ్యర్థించారు. గురువారం వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిసిన ఆయన.. నియోజకవర్గంలో జరగవలసిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వినతి పత్రాలను సీఎంకు ఆయన సమర్పిం చారు. అలానే నియోజకవర్గంలో శిథిలావస్థ కు చేరిన పశువైద్యశాల



భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించేందుకు నిధులు కేటాయించాలని కోరారు. కారంపూడి, మాచర్ల మండలంలో నూతన పశు వైద్యశాలలను కేటాయిం చాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో పార్టీ నాయకులు కుర్రి శివరెడ్డి, పంగులూరి అంజయ్య, పంగులూరి పుల్లయ్య తదితరులు ఉన్నారు.

# విద్యుత్ విజిలెన్స్ దాడులు

పిడుగురాళ్ల మేజర్ న్యూస్ : పిడుగురాళ్ల మండలంలో విద్యుత్ అధికారులు శుక్రవారం విజిలెన్స్ దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 22 డీటీ కేసులు రూ. 44,000లు,32అడిషనల్ లోడ్ రూ .1,26,000.లు, 8మాల్ ప్రాక్టీస్ కేసులు రూ. 24,000లు, మొత్తంగా 66 కేసులకు గాను రూ.2,94,000లు అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా మాచర్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ సింగయ్య మాట్లాడుతూ అనధికార లోడు క్రమబద్ధీకరణ తో గృహ విద్యుత్ వినియోగదారులు 50 శాతం సబ్సిడీతో క్రమబద్ధీకరించు కోవచ్చు అన్నారు. ఒక కిలోవాట్ కు ప్రస్తుతము డెవలప్మెంట్ ఛార్జి రూ.2000 లు చెల్లించాల్సి ఉండగా ఈ పథకంలో రూ.1000 రూపాయలు చెల్లించి అనధికార లోడును క్రమబద్ధీకరించుకోవాలన్నారు. అలాగే గతంలో 2 కిలో వాట్స్ లోడుకు డెవలప్మెంట్ ఛార్జి రూ.4000లు చెల్లించాల్సి ఉండగా ఈ పథకం ద్వారా 2 వేల రూపాయలు చెల్లించి క్రమబద్ధీకరించుకొనుటకు అవకాశం ఉందన్నారు. అలాగే 3 కిలో వాట్స్ అదనపులోడు క్రమబద్ధీకరిం చుకొనుటకు పాత విధానంలో రూ.6000లు చెల్లించాల్సి ఉండగా రూ. 3 వేల రూపాయలు చెల్లించి క్రమబద్ధీకరిం చుకొని వచ్చున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ స్కీము జూన్ 30 వరకు మాత్రమే ఉంటుంది అని తెలిపారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద సోలార్ ప్లేట్లు ఏర్పాటు చేసుకొనుటకు ఒక కిలో వాట్ కి రూ 30,000లు సబ్సిడీ ప్రభుత్వం చెల్లిస్తుంది. అలాగే 2 కిలోవాట్లు సోలార్ ప్లేట్లు ఏర్పాటు చేసుకుంటే రూ.60 వేల రూపాయలు సబ్సిడీ ప్రభుత్వం నుండి లభిస్తుంది. అలాగే మూడు కిలోవాట్ల సోలార్ ప్లేట్లు అమర్చుకున్నట్లైతే రూ .78,000లు సబ్సిడీ వినియోగదా రులకు గృహ విద్యుత్ వినియోగ దారులకు ప్రభుత్వం సబ్సిడీ తో అందజేస్తుందన్నారు. ఈ దాడులలో ఎన్ ఎం ప్రసాద్, రవికుమార్, సతీష్ కుమార్, శివశంకర్, కోటే శ్వరరావు, పిడుగురాళ్ల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి నాగ సురేష్, రూరల్ ఏఈ ఈ. లక్ష్మణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# దొంగలు హల్ చల్ రెండు ఇళ్లలో చోరీ

**- విలువైన ఆభరణాలు, నగదు మాయం**



**పల్నాడు జిల్లా క్రైమ్ న్యూస్ :**

యడ్లపాడు గ్రామంలో అర్ధరాత్రి దొంగలు రెచ్చిపోయారు. రెండు ఇళ్లను లక్ష్యంగా చేసుకుని భారీగా చోరీ చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. బాధితుల వివరాలు, పోలీసుల ప్రాథమిక విచారణ ఆధారంగా ఈ ఘటన గురువారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో చోటుచేసుకున్నట్లు గుర్తించారు.గ్రామానికి చెందిన నరవారి హనుమాన్ సింగ్ అనే గృహ యజమాని తన వృత్తి నిమిత్తం వాహన డ్రైవర్‌గా వెళ్లి అర్ధరాత్రి ఇంటికి చేరగా, తలుపు తాళం పగలగొట్టబడిన దృశ్యం కనిపించింది. లోపలికి వెళ్లి చూశాడో లేదో, ఇల్లు మొత్తం చిందరవందరంగా మారిన దృశ్యం. చూసి చోరీ జరిగినట్టు అర్థమై పోలీసులు సమాచారం అందించాడుబాధితుడు హనుమాన్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం కుటుంబ సభ్యులంతా పని నిమిత్తం ఊరికి వెళ్లిన నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలోనే ఈ దోపిడి జరిగిందని తెలిపాడు. ఈ చోరీలో ఇంట్లోనీ రూ.20 వేల నగదు, 50 తులాల వెండి ఆభరణాలు, 9 గ్రాముల బంగారు ఆభరణాలు, పిల్లల ఉంగరాలు, చెవి దిద్దులు వంటి విలువైన వస్తువులను అపహరించినట్లు గుర్తించినట్లు వెల్లడించాడు.ఇక ఇదే సమయంలో ఇంటి ఎదురుగా ఉన్న దండ ప్రమీల గారింట్లో కూడా దుండగులు చోరీ ప్రయత్నం చేసినట్టు సమాచారం. తాళం పగలగొట్టి లోపలకి వెళ్లినా, అక్కడ విలువైన వస్తువులు కనిపించక పోవడంతో దొంగలు అక్కడి నుంచి వెళ్లిపోయినట్టు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ప్రమీల గారు గ్రామంలో లేరు. కుటుంబ సభ్యులు ఫోన్ ద్వారా ఆమెను సంప్రదించి వివరాలు సేకరించారు. సమాచారాన్ని అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలాలకు చేరుకుని క్లూస్‌టీమ్ సహాయంతో ఆధారాలను సేకరిస్తున్నారు.రెండు ఇళ్లలో కూడా ఒకే విధంగా తాళాలు పగలగొట్టిన విధానం చూసి ప్రొఫెషనల్ దుండగులు అయి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.గ్రామంలో ఇటువంటి దొంగతనాలు పెరుగుతుండటంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. రాత్రి సమయంలో గస్తీ పెంచాలని, విచారణను వేగవంతం చేసి దోషులను తక్షణమే పట్టుకోవాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు...

## పల్లెనిద్ర చేసిన ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద బాబు



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** రొంపిచర్ల మండలం అలవాల గ్రామం నందు శుక్రవారం రాత్రి పల్లెనిద్ర నిర్వహించారు ఈ కార్యక్రమనికి నరసరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు డా"చదలవాడ అరవింద బాబు పాల్గొని అలవాల గ్రామంలో పర్యటించారు ప్రజల నుండి గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమలను గ్రామంలోని ప్రజలకు వివరించారు పార్టీ నాయకులతో పలు సమస్యల పై చర్చించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండేందుకు పలు కార్యక్రమలు చేపడుతున్నామని ప్రజా వేదిక పల్లెనిద్ర కార్యక్రమలు చేస్తున్నామని పట్టణంలో ప్రతి రోజు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేస్తున్నామని ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని వచ్చే నెల నుండి విద్యార్థులకు తల్లికి వందనం రైతులకు ఆర్థిక సహాయాన్ని అందించున్నారని తెలిపారు అనంతరం గ్రామంలో పల్లెనిద్ర చేసారు ఈ కార్యక్రమంలో టీడీపీ జనసేన బీజేపీ కూటమి నేతలు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

## మొబైల్ మెడికల్ యూనిట్ వాహనాలను ప్రారంభించిన కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే

**గుంటూరు, మేజర్ న్యూస్** గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గెయిల్ ఇండియా లిమిటెడ్ సంస్థ సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటుచేసిన రెండు మొబైల్ మెడికల్ యూనిట్ వాహనాలను స్థానిక ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ తో కలిసి పెమ్మసాని శుక్రవారం ప్రారంభించారు. లిఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరంలో గాని పార్లమెంటు పరిధిలో గాని ఎక్కడెక్కడ ఏ ఏ సమస్యలు ఉన్నాయనేది మా టీం సమాచార సేకరణ నిమిత్తం పనిచేశారు. ఒక్కో వ్యాన్ నిర్వహణకు ఏడాదికి రూ. 35 లక్షల చొప్పున 2 వాహనాలకు కలిపి రూ. 70 లక్షలను గెయిల్ సంస్థ ఖర్చు చేస్తోంది. ఈ వ్యానులో ఒక ఎంబిబిఎస్ డాక్టర్, నర్స్, హెల్పర్, డ్రైవర్ వైద్యం నిమిత్తం నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారు. అందులో ప్రాథమిక పరీక్షలు చేసి, 100 రకాల ఉచిత మందులు కూడా అందిస్తారు. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈ వ్యాన్ ఆయా గ్రామాల్లో, మార్గాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటుంది. బీద, బడుగు వర్గాలు నివసించే ప్రాంతాల్లో ముఖ్యంగా ఈ వాహనాలు తిరుగుతూ, ప్రజలకు నిత్యం వైద్య సదుపాయాలకు అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా పనిచేస్తాయి. వన్ ఇయర్ పైలట్ ప్రోగ్రాం కింద ఈ వాహనాలు ముందుగా పనిచేస్తాయి. అందరూ పూర్తిగా వినియోగించగలిగితే మరో సంవత్సరం పొడిగిస్తాము. అలాగే గుంటూరు పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ వాహనాలు తిరిగేలా కృషి చేస్తాం. త్వరలో ఈ రెండు వాహనాల కాకుండా అదనంగా మరిన్ని వాహనాలను తీసుకువచ్చే విధంగా కృషి చేస్తాం. ఈ సౌకర్యాన్ని ప్రజలు పూర్తిగా ఉపయోగించుకుంటారని మనస్ఫూర్తిగా ఆశిస్తూ, మాకు సహకరించిన గెయిల్ సంస్థ నిర్వాహకులకు మా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గెయిల్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనూప్ గుప్తా , డిప్యూటీ మేయర్ షేక్ సజీలా , జిఎంసి కమిషనర్ పులి శ్రీనివాసులు , టిడిపి సీనియర్ నాయకులు తాళ్ల వెంకటేష్ యాదవ్ , ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, జీజీహెచ్ సూపరిండెంట్ రమణ , స్థానిక కార్పొరేటర్ ఎల్లావుల అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కోతుల బారి నుండి విముక్తి

- గ్రామస్తులు ఫిర్యాదు పై వెంటనే స్పందించిన ముటుకూరు సర్పంచ్ చెన్నయ్య.
- 41 కోతులను శాస్త్రీయ పద్ధతిలో బంధించి సమీపాట ఈ ప్రాంతానికి తరలింపు.



**దుర్గి, మేజర్ న్యూస్:** పల్నాడు జిల్లా, దుర్గి మండలంలోని ముటుకూరు గ్రామంలో ఇటీవల కోతుల ఉదంతం గ్రామ ప్రజలను తీవ్ర ఆందోళనలోకి నెట్టింది. రోజురోజుకు పెరిగిన కోతుల సంచారం గ్రామస్తులకు నష్టం కలిగించడమే కాకుండా, చిన్నపిల్లలు నుండి వృద్ధులు వరకు గాయపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో గ్రామస్థులు తమ వేదనను సర్పంచ్ దొండపాటి చెన్నయ్యకి విన్నవించగా, ఆయన వెంటనే స్పందించి ప్రసంశనీయమైన చర్యలు చేపట్టారు. తన సొంత ఖర్చులతో, ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసిన సర్పంచ్ చెన్నయ్య, కోతులను హింసించకుండా, శాస్త్రీయ పద్ధతిలో 41 కోతులను బంధించి సమీప అటవీ ప్రాంతానికి సురక్షితంగా తరలించారని తెలిపారు. ఈ చర్యలతో గ్రామ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇది నా బాధ్యత. ప్రజలు భయంతో బతకకుండా, ప్రశాంతంగా జీవించాలన్నదే నా ప్రయత్నం, అని సర్పంచ్ చెన్నయ్య చెప్పడం విశేషం. సర్పంచ్ చొరవతో ముటుకూరులో సాధారణ జీవనం పునరుద్ధరమవుతుండగా, గ్రామస్తులు హృదయపూర్వకంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరిణామం స్థానిక పాలనలో ప్రజా సంక్షేమానికి ప్రతిబింబంగా నిలిచింది.

# అందరికీ ఆనందం తల్లికి వందనం

- జూన్ 12 నుంచి అమలు దిశగా కూటమి ప్రభుత్వం సన్నాహాలు
- పల్నాడు జిల్లా గణాంకాలు ఇలా
- పథకం అమలులో సవాళ్లు ఎన్నో..



**పల్నాడు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, రాష్ట్రంలోని తల్లులు తమ పిల్లల చదువులకు ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పథకం కింద రూ.13,000 చెల్లించకపోవడం, కూటమి ప్రభుత్వం ప్రకటించిన 'తల్లికి వందనం' పథకం గత ఏడాది అమలు కాకపోవడంతో తల్లుల్లో నిరాశ నెలకొంది. అయితే, తాజా అప్‌డేట్ ప్రకారం, ఈ విద్యా సంవత్సరం (2025-26) నుంచి 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ పథకం జూన్ 12, 2025 నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సమాచారం.

**రాష్ట్రవ్యాప్త గణాంకాలు**

వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పథకం కింద 42 లక్షల మంది తల్లులకు ఏటా రూ.13,000 చొప్పున, మొత్తం రూ.6,000 కోట్లకు పైగా జమ చేసింది. ఈ పథకం 2019-2023 మధ్య నాలుగు విడతల్లో అమలైంది. అయితే, 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నిధులు చెల్లించకపోవడంతో లబ్ధిదారుల్లో అసంతృప్తి నెలకొంది. కూటమి ప్రభుత్వం ప్రకటించిన 'తల్లికి వందనం' పథకం కింద, ప్రతి విద్యార్థికి ఏటా రూ.15,000 చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఒక కుటుంబంలో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉన్నా, అందరికీ ఈ సొమ్ము అందుతుందని మేనిఫెస్టోలో స్పష్టంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 50 నుంచి 55 లక్షల మంది విద్యార్థులు ఈ పథకానికి అర్హులుగా అంచనా వేయబడుతోంది. దీనికి రూ.15,000 కోట్ల నుంచి రూ.20,000 కోట్ల వరకు బడ్జెట్ అవసరం. అయితే, 2024-25 బడ్జెట్ లో ఈ పథకం కోసం కేవలం రూ.9,407 కోట్లు మాత్రమే కేటాయించారు, ఇది హామీని నెరవేర్చడానికి సరిపోదని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

**పల్నాడు జిల్లా గణాంకాల ఇలా**

పల్నాడు జిల్లాలో సుమారు 1.5 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. అమ్మఒడి పథకం కింద జిల్లాలో 1.2 లక్షల మంది తల్లులు లబ్ధి పొందారు, దాదాపు రూ.156 కోట్లు ఈ పథకం ద్వారా జమ అయ్యాయి. అయితే, 2023-24లో ఈ నిధులు అందకపోవడంతో జిల్లా తల్లుల్లో నిరాశ వ్యక్తమైంది. 'తల్లికి వందనం' పథకం కింద, పల్నాడులోని అర్హులైన విద్యార్థుల సంఖ్య ఆధారంగా సుమారు రూ.225 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని అంచనా. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 60శాతం మంది, ప్రైవేట్ పాఠశాలల్లో 40శాతం మంది విద్యార్థులు చదువుతున్నారు.

**పథకం అమలులో సవాళ్లు..** తల్లికి వందనం' పథకం సూపర్ సిక్స్ గ్యారెంటీల్లో కీలకమైనది. దీన్ని అమలు చేయకపోతే, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుందని ప్రభుత్వం గుర్తించింది. అయితే, బడ్జెట్ కేటాయింపు తక్కువగా ఉండటం సవాలుగా మారింది. ఒకవేళ ఒక కుటుంబంలో ఒకే విద్యార్థికి ఈ సొమ్ము పరిమితం చేస్తే, ఎన్నికల హామీ ఉల్లంఘన అవుతుందని తల్లులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బహుసంతానోత్పత్తిని ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో, బడ్జెట్ కేటాయింపు తక్కువగా ఉండటంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, గురజాల వంటి ప్రాంతాల్లో తల్లులు ఈ పథకం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో చాలా కుటుంబాలు ఈ ఆర్థిక సహాయంపై ఆధారపడి ఉన్నాయి. "అమ్మఒడి డబ్బులు ఆగిపోయాయి. ఇప్పుడైనా తల్లికి వందనం ద్వారా సాయం అందితే, పిల్లల చదువులకు ఉపయోగపడుతుంది," అని నరసరావుపేటకు చెందిన ఒక తల్లి ఆవేదన వ్యక్తం చేసింది.

**అమలు వివరాలు..**

ప్రభుత్వం జూన్ 12, 2025న స్కూళ్లు తిరిగి ప్రారంభమయ్యే రోజున ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించే అవకాశం ఉంది. ఈ తేదీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు కూడా కావడం విశేషం. అదే రోజు రైతుల కోసం 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని కూడా ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులు అర్హులు. 75శాతం హాజరు తప్పనిసరి, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఆదాయపు పన్ను చెల్లించేవారు ఈ పథకానికి అనర్హులు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈ సొమ్ము వర్తిస్తుందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. 'తల్లికి వందనం' పథకం రాష్ట్రంలోని తల్లులకు, ముఖ్యంగా పల్నాడు జిల్లా వంటి గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలకు ఆర్థిక ఊతం ఇవ్వనుంది. అయితే, బడ్జెట్ పరిమితులు, అమలు విధానాలపై స్పష్టత లేకపోవడం సవాళ్లుగా ఉన్నాయి. జూన్ 12లోపు ప్రభుత్వం గైడ్‌లైన్స్ విడుదల చేసి, అర్హుల జాబితాను ఖరారు చేయాల్సి ఉంది. ఈ పథకం హామీ మేరకు అమలైతే, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది తల్లులకు ఆనందం కలగనుంది. పల్నాడు జిల్లా తల్లులు కూడా ఈ ఆర్థిక సహాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

## పిల్లలు పుస్తకాలు చదవాలి: ఉర్రూతలూగించిన ప్రదర్శనలు



**తాడేపల్లి, మేజర్ న్యూస్ :** పిల్లలు పుస్తకాలు చదవాలని, అప్పుడే సమాజం అర్థమవుతుందని పలువురు వక్తలు అన్నారు. తాడేపల్లి బైపాస్ రోడ్డు అమరావతి ఐకాన్ లో గత నెల 28వ తేదీ నుండి ఈ నెల 15వ తేదీ వరకు జరిగిన పిల్లల వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా మంగళగిరి- తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు, బహుమతి ప్రధానోత్సవం సభలో రోటరీ క్లబ్ తాడేపల్లి అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, అమరావతి ఐకాన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం వినోద్ కుమార్, అమ్మ కళ్యాణమండపం , విజయవాడ పూర్వ అధ్యక్షులు యార్లగడ్డ సుబ్బారావు, గణితం మాస్టర్ ఎన్ లెనిన్ బాబు, వేసవి శిక్షణ శిబిరం బాధ్యులు ఎం మనోహర్ రెడ్డి మాట్లాడారు. పిల్లలు కథలు పుస్తకాలు చదవాలని, అందులో ఉన్న నీతి సూత్రాలు జీవితంలో ఉపయోగపడతాయని చెప్పారు. చందమామ, బాలమిత్ర లాంటి పుస్తకాలు పిల్లల ముంగిటకు రావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఇరుగుపొరుగు వారితో మనిషి ఎలా జీవిస్తారు, సంఘ జీవిగా తన ప్రయాణం ఎలా కొనసాగిస్తారు అనేది జీవితం అనుభవంలో వస్తుందని చెప్పారు. సమాజంలో మంచి- చెడు రెండు ఉంటాయని మంచిని స్వీకరించాలని ఉద్బోధించారు. కథల ద్వారానే ఇవన్నీ తెలుస్తాయని వివరించారు. పెద్దవారు అయ్యే కొద్దీ పుస్తకాల పట్ల మక్కువ పెంచుకుంటారని చెప్పారు. పుస్తక పఠనం ఎంతో మంచిదని, సబ్జెక్టుకు సంబంధించి పుస్తకాలు మరింత లోతుగా అధ్యయనం చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు, విద్యార్థిని విద్యార్థులు సృజనాత్మకత శక్తి పెరగటానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న బాలోత్సవం, అమరావతి ఐకాన్ బాధ్యులకు అభినందనలు తెలిపారు. పుస్తకాలు చదవడం వల్ల ఏదో ఒక దానిలో నైపుణ్యం సాధించవచ్చు అని తెలిపారు. దురదృష్టవశత్తు ఇటీవల బుక్ రీడింగ్ తగ్గి లుక్కు రీడింగ్ ( టీవీ, సెల్ ఫోన్ ) పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతి ఐకాన్ లో ఏర్పాటుచేసిన లైబ్రరీని కూడా పిల్లలు, పెద్దలు వినియోగించుకోవాల నీ కోరారు. సమ్మర్ క్యా ంప్ విజయవంతం విజయవంతం కావడానికి సహకరించి న అమరావతి ఐకాన్, మరియు రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి వారికి ఎంటిఎంసి బాలోత్సవం తరఫున అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఫౌండర్ మరియు చైర్మన్ గోపు నాగ రాజేష్, ఓబులారెడ్డి, డాన్స్ మాస్టర్ చందు, సిహెచ్ శివరామిరెడ్డి, వై బర్నబాస్, డి కోదండరామయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి.

## నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించిన పి ఆర్ కమిషనర్

**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్:** నిర్మాణంలో ఉన్న భవనాల త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఎం. వెంకట రామకృష్ణ తేజ సూచించారు. శుక్రవారం నిర్మాణంలో ఉన్న జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం భవనాన్ని ఆయన ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా తో కలిసి పరిశీలించారు. జరుగుతున్న పనుల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా పరిషత్ ప్రాంగణంలోని నూతనంగా ఏర్పాటు చేసిన డి ఎల్ డి ఓ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతి బస్సు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఓ ఎస్ డి వెంకటకృష్ణ, ఆర్డబ్ల్యూఎస్ ఈ కళ్యాణ చక్రవర్తి, డి.ఇ శివరామకృష్ణ, పంచాయతీ రాజ్ ఎస్ ఈ బ్రహ్మయ్య, డిడబ్ల్యూఎంఏ పిడి శంకర్, డిపి సాయికుమార్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

